# వలసదార్లపై హింసాకాండ

**మానవహక్కుల** పరిరక్షకులం అంటూ తమ ప్రజాస్వామ్యం గురించి అమెరికా సామ్రాజ్యవాదం గొప్పలు చెప్పుకుంటోంది. అయితే వేలాదిమంది వలసదారు పిల్లలను తల్లిదండ్రుల నుంచి వేరుచేసి ఎడారుల్లో ఏర్పాటుచేసిన గుడారాల్లో ఉంచుతోందని ఇటీవల వార్తలు చెప్తున్నాయి. తమ తల్లిదండ్రులు ఎక్కడున్నారో పిల్లలకు తెలియదు. కనీసం వారితో మాట్లాడే అవకాశమే లేకుండా చేస్తోంది.

రోజుకు 250 మందికి పైగా పిల్లలను నిర్బంధిస్తున్నారంటే అమెరికా ప్రభుత్వ క్రూరత్వం అర్ధమవుతోంది. జైళ్ళు పిల్లల రోదనలతో నిండి పోతున్నాయి. అమెరికా అంతటా పిల్లలకోసం గుడారాలు, శిబిరాలు వెలుస్తున్నాయి. వంద డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రత ఉండే ఎడారుల్లో కూడా వీటిని ఏర్పరుస్తున్నారు. ఈ పిల్లలను గార్డులు దూషించటమే కాకుండా హింస, లైంగిక వేధింపులకు గురిచేస్తున్నట్లు నివేదికలు తెలుపు తున్నాయి.

ఇది ముమ్మాటికీ బాలల హక్కుల హననమేనని పిల్లల వైద్య అకాడమీ అంతర్జాతీయ మానవహక్కుల సంస్థ పేర్కొంది. ఐక్యరాజ్యసమితి దీనిని తీవ్రంగా గర్హించింది. తాను సిఫార్సు చేసినవారిని తీవ్రవాదులుగా ముద్రవేయనందున ఐక్యరాజ్యసమితి మానవహక్కుల సంఘం నుంచి అమెరికా వైదొలగింది. దీని బట్టి అమెరికా మొండి వైఖరి అర్ధమవుతోంది. ఇది మానవహక్కులపై అమెరికా నిజస్వరూపాన్ని తెలుపుతోంది.

అమెరికా సామ్రాజ్యవాదానికి ఇది కొత్తేమీ కాదు. వలసదార్లపై దాష్టీకం దాని విధానంలో భాగమే. బానిసలను జైళ్ళలో పెట్టడం, విప్లవకారులను మొదటి ప్రపంచ యుద్ధం తర్వాత దేశం నుంచి వెళ్ళగొట్టడం, రెండో ప్రపంచయుద్ధం తర్వాత అమెరికాలోని జపాన్ వారిని నిర్బంధించటం అమెరికా క్రూర విధానానికి కొన్ని నిదర్శనాలు మాత్రమే. వలసదార్ల సమస్య సామ్రాజ్యవాదం సృష్టించిందే. అతితక్కువ వేతనాలతో అధిక లాభాలను గడించటానికి వలసదార్లను దోచుకుంటున్నారు. లాటిన్ అమెరికా, ఆసియా, ఆఫ్రికా దేశాల్లో ఆర్థిక వ్యవస్థలు నాశనమవడంతో, సామ్రాజ్యవాద దేశాల నిరంతర దురాక్రమణలు, దాడుల వల్ల ఆయా దేశాల నుంచి ప్రజలు పారిపోతున్నారు.

1970 - 80 దశకంలో అమెరికా వెన్నుదన్నులున్న సెంట్రల్ అమెరికాలో నియంతృత్వ పాలనలు అన్ని సమాజాలను సర్వనాశనం చేశాయి. వేలాదిమంది ప్రజలను హింసించి, ఊచకోత కోశాయి. 1960, 70ల్లో వియత్నాం, కంబోడియా, లావోస్‌లలో అమెరికా సామ్రాజ్యవాదం 30 లక్షల మందిని పొట్టన పెట్టుకుంది. జాతి ఆర్థిక వ్యవస్థలను నాశనం చేయటమే కాకుండా ఖనిజ వనరులు దోచుకొని పర్యావరణాన్ని సామ్రాజ్య వాదులు ధ్వంసం చేశారు. ఇప్పటికీ దురాక్రమణ సాగిస్తూనే ఉంది. ఈ శతాబ్దపు చివరి భాగమంతా మధ్యప్రాచ్యం అమెరికా దురాక్రమణకు గురైంది. లక్షలాదిమంది ప్రాణాలు కోల్పోయారు. ప్రస్తుతం వున్న వలసదార్ల సమస్యలన్నీ సామ్రాజ్యవాద విధానాలు, దాని సంక్షోభం నుండి ఉద్భవించినవే.

దీనిపై ట్రంప్ స్పందన చూస్తే సామ్రాజ్యవాద విధాన కాఠిన్యం అర్ధమవుతుంది. వలసదార్లని పిల్లల స్మగ్లర్లుగా ట్రంప్ అభివర్ణించాడు. పైగా తను చెప్పేదే నిజమని దీనిపై ఎవరి నిర్ణయం అవసరం లేదని, వలసదార్లను రానిచ్చేదిలేదని ట్వీట్ చేశాడు.

అయితే ఈ వలసదార్లపై దాష్టీకం ఒక్క అమెరికాకే పరిమితంకాదు. ఇది అన్ని సామ్రాజ్యవాద దేశాల్లోనూ కొనసాగుతోంది.

కరేబియన్ దేశాల నుంచి వచ్చి ఇంగ్లండులో దశాబ్దాలుగా పనిచేస్తున్న కార్మికులను దేశం నుంచి బహిష్కరిస్తామని బెదిరిస్తున్నారు. వారికి ఇళ్ళు, వైద్యసౌకర్యం, పెన్షన్ల లాంటివి దక్కనీయరు. అయితే వలసదార్లకు ప్రతికూల పరిస్థితులున్నాయని మాత్రం ప్రభుత్వం ఒప్పుకుంటోంది.

జర్మనీలో రాజకీయ నేతలందరూ శరణార్థుల సమస్యకు తుది పరిష్కారం కావాలని బహిరంగం గానే మాట్లాడతారు. దేశంలో చీలికకు, ఆర్థిక కష్టాలకు ఈ శరణార్థులే కారణమని జర్మనీ ఛాన్సలర్ మెర్కిల్ నాజీల నియంతల ధోరణితో మాట్లాడుతుంటోంది. గత నెల ఫ్రాన్స్‌లో మక్రాన్ ప్రభుత్వం వలసలను నిషేధిస్తూ క్రూరమైన చట్టాన్ని తెచ్చింది. ప్రపంచంలోని కష్టాల్ని స్వీకరించేందుకు తాము సిద్ధంగాలేమని ఆయన ప్రకటించాడు. సామ్రాజ్యవాద విధానాల వల్ల తలెత్తిన ఈ సమస్యను పక్కదోవ పట్టించేందుకు యత్నించాడు.

ఇటలీ మంత్రి సాల్విని అయితే రోమన్ల జాతీయ రిజిస్ట్రీని రూపొందించాలని పిలుపునిచ్చాడు. ఇక ఛాందసవాదులైతే 5 లక్షల మంది శరణార్థులను పంపించేయాలని డిమాండ్ చేస్తున్నారు. దీనితో తరచుగా వారిపై దాడులు కూడా జరుగుతున్నాయి.

సామ్రాజ్యవాదశక్తులు సిరియాపై బాంబు దాడులు జరుపుతున్నాయి. ఆఫ్రికా, మధ్యప్రాచ్యంలో సైనిక జోక్యం పెరిగిపోవటంతో శరణార్థుల సంఖ్య మరింత పెరిగిపోతున్నది. శరణార్థులు యూరప్‌లోకి ప్రవేశించకుండా యూరోపియన్ యూనియన్‌కు కవచంలా వ్యవహరిస్తున్న టర్కీలో ప్రస్తుతం 35 లక్షలమంది సిరియా ప్రజలున్నారు.

దారిద్ర్యం, నిరుద్యోగం, యుద్ధాలు, ఈ వలసలకు కారణమవుతున్నాయి. ఈ సమస్యలన్నీ ప్రత్యక్షంగా, పరోక్షంగా సామ్రాజ్యవాదం, పెట్టుబడిదారీ వ్యూహం సృష్టించినవే. ఈ రకంగా ఇప్పటికే 25 కోట్లమంది ప్రపంచ శరణార్థులున్నట్లు అంచనా.వీరంతా పనికోసం ఇళ్ళను, కుటుంబాలను వదలివేస్తున్నవారే. సామ్రాజ్యవాద దేశాల్లో ముఖ్యంగా 2008 తర్వాత కార్మికవర్గ జీవన ప్రమాణం దారుణంగా దిగజారింది. ఇదే సమయంలో ఒక శాతంగా వున్న ప్రపంచ ధనికవర్గం సంపద ప్రతిఏటా 6 శాతం పెరుగుతూనే ఉంది. ప్రపంచంలో 50 శాతం పేదవారి వద్ద ఎంత సంపద ఉందో, అంత బూర్జువావర్గంలోని 43 మంది వద్దే ఉంది. దీంతో కార్మికవర్గంలో అసంతృప్తి, ఆగ్రహం పెరుగుతోంది. దీన్ని పక్కదారి పట్టించేందుకు జాత్యహంకారం, జాతీయ పిడివాదాలను ప్రోత్సహించి చట్టపరమైన రాజకీయ ఉచ్చులతో కార్మికవర్గాన్ని అణచివేయాలని చూస్తున్నారు. జాతీయోన్మాద భావాలతో కార్మికవర్గంలో అనైక్యతను తెచ్చి బలహీనపరచాలని పాలకవర్గాలు కుయుక్తులు పన్నుతున్నాయి. వలసదార్లపై చర్యలు, దాడులు సామ్రాజ్యవాదుల చర్యల్లో భాగమే.

సామ్రాజ్యవాద దేశాల దాష్టీకాన్ని 'జనశక్తి' ఖండిస్తోంది. కార్మికవర్గమంతా ఐక్యమై వలసదార్ల హక్కుల కోసం పోరాడాలని పిలుపునిస్తోంది.

1864లో జరిగిన ఫస్ట్ ఇంటర్నేషనల్ ప్రారంభసభలో కారల్‌మార్క్స్ చెప్పింది ప్రస్తుతం సందర్భోచితంగా వుంటుంది :

“వివిధ దేశాల కార్మికుల మధ్య ఉండాల్సిన భాతృత్వ భావన ఎంత నిర్లక్ష్యానికి గురైందో, విముక్తికోసం ఒకరికొకరు గట్టిగా నిలబడేందుకు ప్రేరేపితులవ్వాల్సిన అవసరాన్ని గత అనుభవాలు చెప్తున్నాయి. అదే సమయంలో పొంతన లేని చర్యలను తక్షణం ఉమ్మడిగా గర్హించాలి.”

ooooo